క్లుప్తంగా

ఇందుపల్లి పీహెచ్‌సీ తనిఖీ

ఉంగుటూరు: ఇందుపల్లి పీహెచ్‌సీని సందర్శించిన ఆయుష్మాన్‌భారత్ స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ నరేష్ బృందం బుధవారం సందర్శించింది. కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు పీహెచ్‌సీని సందర్శించి అక్కడ ఉన్న సదుపాయాలు పరిశీలించారు. బృందంలోని డాక్టర్లు కిరణ్, సుస్మితలు రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. మందులు, ల్యాబ్ పరీక్షలు, ఓపీ ఏవిధంగా ఉంటుందని ఆరా తీశారు. ఒక స్టాఫ్ నర్సు, క్లాస్ ఫోర్ ఉద్యోగి అవసరం ఉందని పీహెచ్‌సీ డాక్టర్లు బి.శిరీష, సుబ్బారావు వివరించారు. బృందం అక్కడ ఉన్న వసతులు, అవసరాలను నివేదికను రూపొందించారు.

తిరుపతి, జగల్దాపూర్‌కు కొత్త బస్సులు ప్రారంభం



గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి తిరుపతి, జగల్దాపూర్ రూట్లలో నడపనున్న కొత్త బస్సులు బుధవారం అందుబాటులోకి వచ్చాయి. బస్టాండ్ ఆవరణలో కొత్త బస్సులను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఉయ్యూరు: బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై ఉయ్యూరు పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన గండిగుంట సర్వీసు రోడ్డువద్ద ఆనందపురంకు చెందిన కర్రా రాంబాబు (54) ద్విచక్రవాహనంపై ఉయ్యూరు నుంచి ఇంటికి వెళ్తుండగా నాగాయలంక నుంచి విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. ఈ ఘటనలో రాంబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. కూలి పనులు చేసుకునే రాంబాబుకి భార్య, పాప, బాబు సంతానం. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన జీవనం

హనుమాన్‌జంక్షన్ రూరల్: రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగానికి స్వస్తి చెప్పి, ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంభించటం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని పొందగలమని రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.పార్థసారథి అన్నారు. స్థానిక మహాత్మగాంధీ నగర్‌లోని మండల మహిళా సమాఖ్య భవనంలో ప్రకృతి వ్యవసాయంపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరయ్యారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించటం వల్ల పెట్టుబడి వ్యయం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకంతో భూసారం తగ్గిపోతుందని, ఆహార ఉత్పత్తులు విషతుల్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ వ్యవసాయ ఆర్థిక నిర్వహణ, మెరుగుదల, దిగుబడి పెంపు, జీవామృతం తయారీ గురించి మహిళలకు వివరించారు. ఏరియా కోఆర్డినేటర్ నాయక్, మండల మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



పెనమలూరులో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేసిన సర్పంచ్ లింగాల భాస్కరరావు



కంకిపాడు గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రతినిధులు



మానికొండలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గోగినేని వెంకటేశ్వరరావు

పెనమలూరు: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని వణుకూరు గ్రామ సర్పంచ్ చక్క విజయ అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా వణుకూరులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాలు విద్యార్థుల విజ్ఞానానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురామ్, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, సతీష్‌కుమార్, గ్రంథాలయ అధికారి భారతి పాల్గొన్నారు. పెనమలూరులో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఎంపీడీవో బండి ప్రణవి, గ్రామ సర్పంచ్ లింగాల భాస్కరరావు పలు పోటీల్లో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేశారు. విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లటం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.హరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు....

ఉయ్యూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. వివిధ అంశాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సీఐ రామారావు, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కౌన్సిలర్ కూరాడ వెంకటలక్ష్మి బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి రమణి పర్యవేక్షించారు. ముదునూరు గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి కె.నాగరాజు పర్యవేక్షించారు. పట్టణంలోని ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలోని గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు ఏఎన్నార్ కళాశాల గ్రంథాలయాధికారి పద్మజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ బహుమతులు అందజేశారు.

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

గన్నవరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పుణ్యా చారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్‌కుమార్ ఆర్థిక సౌజన్యంతో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నర్రా సీతారామారావు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో గ్రంథాలయాలు ప్రముఖ పాత్ర వహించాయని తెలిపారు. ఇటువంటి మహోన్నతమైన చరిత్ర కలిగిన గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. అనంతరం 50 మంది విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వ రుసుం నిమిత్తం రూ. 5 వేలు విజయభూషణ్‌కుమార్ అందజేశారు. కమిటీ సభ్యులు చిటమ రామారావు, విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, రోటరీయన్ కంభంపాటి సూర్యచంద్రరావు, విశ్రాంత ఇంజనీర్ గోగినేని హరికృష్ణప్రసాదరావు, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంలు కేఎస్ జగదీశ్వరరావు, బి.ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: గ్రంథాలయాలతో విజ్ఞానం వృద్ధి చెందుతుందని వక్తలు పేర్కొన్నారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు, సెయింట్‌మేరీస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ చిత్ర, ఎస్‌కే మదార్‌బి, అంబుల గోపి, తంబాబత్తుల శేషుబాబు, గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం శివకుమారి, చరిత స్కూల్ హెచ్‌ఎం వేదవతి తాయారు, మహిళా సంరక్షణ కార్యదర్శి జ్యోతి, గ్రామపెద్దలు సునీత, డి.చంద్రశేఖర్, సుమిత్ర పాల్గొన్నారు. పోటీలను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

ఉంగుటూరు: మండలంలో మానికొండ, ఉంగుటూరు, తేలప్రోలు, ఆత్కూరు శాఖా గ్రంథాలయాల్లో వారం రోజులుగా కొనసాగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. మానికొండ ముగింపు సభలో గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు గోగినేని వెంకటేశ్వరరావు మాట్లాడారు. వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎల్.హరికృష్ణ, హెచ్‌ఎం కె.శివరామకృష్ణ, అసిస్టెంట్ లైబ్రేరియన్ నాంచారయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: గ్రంథాలయాలతో విజ్ఞాన సమాజం విలసిల్లుతుందని గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కెఎస్ జగదీశ్వరరావు తెలిపారు. పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రంథాలయం ఉండాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి ఆకాంక్షించారు. లైబ్రేరియన్ కె.కృపానందం సేవలను వక్తలు కొనియాడారు. ఉపాధ్యాయులు దామోదర గణపతిరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొని వారోత్సవాల సందర్భంగా వివిధ పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

నేడు పోరంకిలో విద్యుత్ నిలిపివేత

పెనమలూరు: పోరంకి సెక్షన్‌లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. సిద్ధార్థ ఫీడర్ మరమ్మతులు కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా బీజేఆర్‌నగర్, నిడమానూరు రోడ్డు, పోరంకి సెంటర్, ప్రభునగర్, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని స్థానికులు సిబ్బందితో సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారం కోరుతూ హమాలీల ధర్నా

పెనమలూరు: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ కానూరు పౌరసరఫరాల కార్యాలయం వద్ద ఏపీ పౌరసరఫరాల సంస్థ హమాలీల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. హమాలీలు కార్పొరేషన్ కార్యాలయం వద బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన మెమోరాండం పౌరసరఫరాల శాఖ అధికారికి అందచేసి వివరాలు వెల్లడించారు. హమాలీల కూలీ రేట్ల ఒప్పందం గత ఏడాది డిసెంబర్‌లో ముగిసిందన్నారు. జనవరి 1వ తేదీ నుంచి క్వింటాకు రూ.25 నుంచి రూ 40కు కూలీ పెంచి బకాయితో ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని మానేసినా, చనిపోయినా పీఎఫ్ వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదంలో మరణిస్తే రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ నేతలు కె.ఉమామహేశ్వరరావు, నాగరాజు, ఉదయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు

వల్లభనేని వంశీ అనుచరుడి స్థలంలో కట్టడాలు కూల్చివేత



కిడ్స్ ప్లే జోన్‌లో కట్టడాలను తొలగిస్తున్న కూలీలు

గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్, ఆయన అనుచరులను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను కొనసాగిస్తోంది. వంశీమోహన్ అనుచరులైన ఎనిమిది మందిని మంగళవారం అక్రమ అరెస్టులు చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగి 24 గంటలు గడవక ముందే మరో అనుచరుడైన గొంది పరంధామయ్యకు చెందిన స్థలంలో నిర్మాణాలను కూల్చివేతకు దిగింది.

మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్యకు చెందిన దావాజిగూడెం పరిధిలోని జాతీయ రహదారి పక్కన స్థలంలో దాబా, కిడ్స్ ప్లేజోన్, క్రికెట్ నెట్‌లను అద్దె ప్రాతిపదికన బయట వ్యక్తులు నిర్వహిస్తున్నారు. అయితే గత ఎన్నికల్లో టీడీపీకి వ్యతిరేకంగా పనిచేశారనే కక్షతో ఆ కట్టడాలను తొలగించాలని సీఆర్‌డీఏ, గ్రామపంచాయతీ అధికారుల ద్వారా నోటీసులు జారీచేస్తున్నారు. కట్టడాలు తాత్కాలికమైనప్పటికి సీఆర్‌డీఏ అనుమతులు లేవని, వాగు పోరంబోకు అక్రమణల పేరుతో బెదిరింపు చర్యలకు దిగారు. ఈ నేపథ్యంలో శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు బుధవారం తెల్లవారుజామున సీఆర్డీఏ, గ్రామపంచాయతీ, రెవెన్యూ అధికారులు పొక్లెయిన్లు, సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అయితే జీవన ఆధారమైన వ్యాపార కట్టడాలను కూల్చివేయవద్దని నిర్వాహకులు ఎంత విన్నవించినా అధికారులు ఏమాత్రం కనికరించలేదు. దాబా హోటల్ నిర్వాహకురాలైన మహిళా కన్నీరు మున్నీరుగా విలపించడం స్థానికులను కలచి వేసింది. అయినప్పటికి నిర్ణీత గడువులోపు కట్టడాలను తామంతటికి తాము తొలగించాలని, లేనిపక్షంలో పూర్తిగా ధ్వంసం చేస్తామని అధికారులు హెచ్చరికలుల జారీచేశారు. చివరికి నిర్వాహకులే కూలీలను ఏర్పాటు చేసుకుని కట్టడాలను తొలగింపు పనులు చేపట్టారు. కట్టడాలు తొలగింపు వల్ల 30 మంది వరకు కూలీలు ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది. కట్టడాల కూల్చివేత పనులను తహసీల్దారు వెంకటశివయ్య, సీఆర్డీఏ సూపర్‌వైజర్ సాయిలీల, పరిసరా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పర్యవేక్షించారు.

యనమలకుదురులో దీపోత్సవం



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో కొండ పై వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో భక్తులు బుధవారం దీపోత్సవం చేశారు. పూలతో ఆలయ ప్రాంగణం అలంకరించి దీపోత్సవం నిర్వహించారు. పోరంకికి చెందిన భక్తులు దీపోత్సవం చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన అవసరం

కంకిపాడు: ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన అవసరమని సీఐడీ విజయవాడ రీజనల్ అదనపు సూపరింటెండెంట్ డి.ప్రసాద్ అన్నారు. మండలంలోని గొల్లగూడెం ఆర్సీఎం పాఠశాల ప్రాంగణంలో సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవిశంకర్ అయ్యనార్ ఆదేశాలతో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ఒక రోజు వర్క్‌షాప్ బుధవారం నిర్వహించారు. అదనపు సూపరింటెండెంట్ డి.ప్రసాద్ మాట్లాడుతూ చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగినప్పుడు వారికి తక్షణ సాయం అందించేందుకు, నిందితులపై చర్యలు తీసుకునేందుకు ఈ చట్టం దోహదం చేస్తుందని తెలిపారు. సర్పంచ్ నత్తా దుర్గాభవాని, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం.ఫణిదూర్జటి, ఎంపీడీఓ పి.అనూష, తహసీల్దార్ వి.భావనారాయణ, డీవైఈఓ ఎం.పద్మావతి, ఎంఈవో బీవీ శేషగిరిరావు, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు టి.వెంకటకృష్ణ, బి.మోహన్‌రావు, సీఐ జె.మురళీకృష్ణ, ఎంపీటీసీ కె.విజయకుమారి, పలు విభాగాల సీఐడీ అధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు

రాష్ట్ర హెల్త్ కమిషనర్ వాకాటి కరుణ



వణుకూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రోగులతో మాట్లాడుతున్న హెల్త్ కమిషనర్ వాకాటి కరుణ

పెనమలూరు: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏపీ కమిషనర్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ వాకాటి కరుణ అన్నారు. వణుకూరు గ్రామంలో ఆయుష్మాన్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అందుతున్న వైద్య సేవలను ఆమె పరిశీలించి రోగులు, సిబ్బందితో మాట్లాడారు. ప్రజారోగ్యం మరింత క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయటానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అమలవుతున్న వైద్య సేవలు పరిశీలిస్తున్నామని చెప్పారు. కమ్యూనికబుల్, నాన్ కమ్యూనికబుల్ (ఎన్‌సీడీసీడీ)వ్యాధుల పై ఇంటింటా సర్వే చేపట్టామని తెలిపారు. అలాగే వైద్య సిబ్బంది నైపుణ్యం, క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. ఆయూష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే సీహెచ్‌వో, ఏఎన్‌ఎం, పని తీరును అంచనా వేసి ప్రతి 15 రోజులకు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా అందుతున్న సేవలను సమీక్షిస్తామన్నారు. పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషినల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ సందర్శించారు.చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఆర్.గణపతిరావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గీతాబాయ్, మండల వైద్యధికారి బిజిలీ శ్రీనివాసరావు, రాష్ట్ర ఐటీ ఈమ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శివాలయం ప్రతిష్టా మహోత్సవం



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడులో నూతనంగా నిర్మించిన శ్రీ భ్రమరాంబ సమేత శ్రీశైల మల్లిఖార్జున స్వామి బ్రహ్మసూత్ర మరకతలింగం ప్రతిష్టా మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక ధర్మ కోనేరు వద్ద దాతల సహకారంతో నిర్మించిన శివాలయం ప్రతిష్టామహోత్సవాన్ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శివనామస్మరణతో నూతన ఆలయ ప్రాంగణం మార్మోగింది. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, హోమలు నిర్వహించారు. ముముక్షు మహా జన పీఠాధిపతి గౌరు కృష్ణ నేతృత్వంలో అర్వపల్లి బుచ్చి రామశర్మ, ఒసూరి మురళీకృష్ణాచార్యులు ఆలయంలో మరకతలింగ మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలను నిర్వహించారు. 45 అడుగుల ఏకశిల ధ్వజస్తంభాన్ని మంత్రోర్ఛరణల మధ్య ప్రతిష్టించారు. వేలాది మంది భక్తులు కార్యక్రమానికి తరలివచ్చారు.

బందరులో సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం



సీఎంఆర్ షాపింగ్‌మాల్‌లో సినీతారలు నయన్‌సారిక, పాయల్‌రాజ్‌పుత్ తదితరులు

మచిలీపట్నంటౌన్: నగరంలో అతి పెద్ద వ్యాపార సంస్థ సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సినీతారలు నయన్ సారిక, పాయల్ రాజ్‌పుత్ పాల్గొని సందడి చేశారు. అభిమానులకు అభివాదం చేసి, సెల్ఫీలతో ఉత్సాహపరిచారు. వీరిద్దరూ జ్యోతిప్రజ్వలన చేసి షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు.

అమ్మకాలను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి నీలిమ, మచిలీపట్నం మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ప్రారంభించారు. సీఎంఆర్ ఫౌండర్ చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తమ సంస్థను నాలుగు దశాబ్దాలుగా ఆంధ్ర, తెలంగాణ ప్రజలు ఆదరిస్తున్నారని 37వ షోరూమ్‌ను మచిలీపట్నంలో ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహనబాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎఫ్‌సీఐ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

విజయవాడస్పోర్ట్స్: భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడ శివారు నున్నలోని గ్రీన్ ఫీల్డ్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌సీఐ ఏపీ రీజనల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్‌యాదవ్ తెలిపారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, తాడేపల్లిగూడెం, విజయవాడ, నెల్లూరు, కర్నూలు డివిజనల్ కార్యాలయాల జట్లు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. పోటీల్లో విజేత జట్లకు ట్రోఫీలను అందజేస్తామన్నారు.

పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు

ఉంగుటూరు: పశువుల్లో గర్భకోశ వ్యాధుల నివారణకు రైతులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాస్ సూచించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరు మండలం నారయ్య అప్పారావుపేటలో బుధవారం పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. 80 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

పెనమలూరు: మండలంలోని పెదపులిపాక గ్రామంలో యువకుడి పై వ్యక్తి దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. శ్రీనగర్‌కాలనీలో కె.తాండవవకృష్ణ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఆయన కుమారుడు రాకేష్‌వర్మ ఇంటర్ చదువుతున్నాడు. కుమారుడు ఫ్రెండ్స్ వద్దకు వెళ్లి వస్తానని ఇంటి సమీపంలో ఉంటున్న మిత్రుల వద్దకు వచ్చాడు. అయితే ఒక పిల్లవాడు మద్యం తాగిన వాసన రావటంతో ఎవరు మద్యం తాగించాడని రాకేష్‌వర్మ అడుగగా మనోహర్ అనే వ్యక్తి తాగించాడని పిల్లవాడు సమాధానం చెప్పాడు. అదే సమయంలో మనోహర్ అనే వ్యక్తి అక్కడికి రాగా చిన్న పిల్లవాడికి మద్యం ఎందుకు తాగించావని రాకేష్‌వర్మ నిలదీశాడు. దీంతో మనోహర్ రాకేష్‌వర్మపై దాడి చేశాడు. ఈ ఘటనలో రాకేష్‌వర్మ దవడ ఎముక విరిగింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

ర్యాలీ విజయవంతం చేయాలి

పెనమలూరు: ఈ నెల 26వ తేదీన మచిలీపట్నంలో జరగనున్న కార్మిక, రైతుల ర్యాలీని విజయవంతం చేయాలని కార్మిక, రైతు సంఘాల నేతలు పిలుపు నిచ్చారు. పోరంకిలో బుధవారం మానికొండ సుబ్బారావు, సత్యవతి కార్మిక కార్యాలయంలో కార్మిక, రైతు సంఘాల నేతల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘాల నేతలు మాట్లాడుతూ కార్మికులు, రైతులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు తీరని అన్యాయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు.